# భ్రమ

రచన
శ్రీ ఆదూరి వెంకటసీతారామమూర్తి

నేను నడుస్తున్నాను, ఆవిడా నడుస్తోంది. తను ముందు, నేను వెనుక. ప్రక్కనుంచి బస్సులు దూసుకు పోతున్నాయి. గబ్బివాల్లా వేలాదే ప్రజలతో దుమ్ము రేగుతోంది సాయంకాలపు నీరెండ మెలిసి మాయమైంది. నల్లచీరతో కన్య నడచివస్తోంది. చంద్రుడు ప్రకాశాన్ని యింకా గుర్తించ లేదు.

ఆకారాన్ని బట్టి ఆమెలానే వుంది. సన్నగా వెనుకకు వాలిన వాలు జడలో ఒంటిపేటలో సంపెంగలు _ ఎత్తు నుంచి క్రిందికి జారిన సన్నని నడుమూ. నల్లటి పొట్టి చేతుల రవిక. చిన్న పువ్వుల తెల్లచీర, కాలికి ఎత్తు మడమల జోడు నల్ల గాజాలున్న చేతిలో వానిటీబాగ్.

రెండో చెయ్యి ఎత్తి టైం చూసుకుంది తను _ నేనూ చూసుకున్నాను. చలికాలపు సాయంకాలం ఆరవుతోంది. మ్యునిసిపాలిటీ వారు చేసే సగం సగం పనుల వల్ల రోడ్డంతా కంకర వెదజల్లి ఉంది. ఒక ప్రక్క వాహనాలు ఒక ప్రక్క రోడ్డు అవక తవకలు ఇవీ మిగిలాయి సామాన్య మానవునికి _ సుఖవాహన మంటే ఏ బాధలేదు. ఉన్నా తరుణోపాయం ఉండనే ఉంటుంది_తను పొందని సుఖాన్ని వూహించుకొని గాలి మేడలు కట్టుకోవడం, చూడని సినిమాలను విమర్శించుకోడం నోటికి రాని పాటలను ఆత్రంగా పాడటం, ఇంగ్లిషు పిక్చర్లను మెచ్చుకోడం ఇవీ ప్రజాస్వామ్యంలో మానవుడికి మిగిలినవి.

సందేహంలేదు తనే అయివుంటుంది. ఆకారమంతా చూసినట్లే ఉంది రెండు సంవత్సరాల క్రిందట చూసినా రెండు క్షణాలలో ముద్రించుకుపోయిన ఆమె రూపం మనసులో యింకా ఎక్కడో మిగిలే ఉంది, పెళ్లి చూపు అందే యిష్టపడని నేను ఆ రోజు ఆమెను చూడటం తప్పలేదు. ఆమె ఎంతో అందంగా అలంకరించి తీసుకు వచ్చి ముందు కూర్చుండ బెట్టారు. ఆశ్చర్యమనిపించింది. అందమైన తెల్లటి ఆమె ముఖంలో చిన్ని మచ్చలు. చంద్రుడికి ఒక్కటే _ ఈమెకు ఎన్నో _ అనిపించింది. బరువైన రెప్పలు మెల్లగా ఎత్తి బిత్తరగా చూసింది_ తొలిచూపు కాటుక కళ్లు అందంగా మెరిశాయి చంద్రుడిని మించి_అందరూ ఏవేవో అడిగారు ఆమె సమాధానాలు ఒకటి రెండిటికే యిచ్చినట్లు గుర్తు. నేనాట్టే పట్టించుకోలేదు, అంత మందిలో ఏదేకంగా ఆమెను చూస్తూ కూర్చున్నందుకు తర్వాత సిగ్గుపడ్డాను.

తర్వాత తెల్సింది అమ్మకు నాన్నకు ఆ అమ్మాయి నచ్చలేదని_ఎందుకు నచ్చలేదన్న ప్రశ్న వుక్రోషంగా అడిగాను. ఏదో శాఖ భేధంట _ పైగా అమ్మాయికి మచ్చలట! ఐతేనేం పెళ్ళి చేసుకొనేది నేనుగా_అనాలనిపించింది _ సింహం వంటి నాన్నగారి ముందు తలవంచాను_అమ్మలోని అసమర్థత నాకెప్పుడూ తెల్సినదే పెళ్ళి చూపులనేది కాయగూరల బేరం, ఆడమనిషి జీవితంలో పెద్ద యింటర్వ్యూ. అందానికీ యౌవనానికీ గుణాలకీ పరీక్ష _ స్వతంత్రత లేని భారతదేశపు స్త్రీకి అగ్ని పరీక్ష! మహా శిల్పి చేసిన ఎగ్జిబిషన్‌లోని ప్రతిమను చూసినట్లు అందరు చూస్తారు. కొందరికి ఆ శిల్పంలోని అందాలు అర్థంకావు. కొందరికీ కొన్ని కోణాలలో ఎంతో బావుంటుంది. బావున్నా స్వతం చేసుకోవాలంటే ఎంతో ఖర్చు చాల శ్రమ ఎందర్నో మెప్పించాలి. ఎలాగైనా ఆ అమ్మాయినే చేసుకోవాలన్నే కోరిక పెరిగింది! మగాడి కోరికలు ధైర్యంవల్ల తీరం పోతాయి. ఎలా? ఎదిరించడమనేది నాలో యిప్పటి వరకూలేదు. ఐనా తప్పదు. పెళ్ళంటే అయిష్టత చూపించే నాకు పెళ్ళిమీది ఆసక్తి కలిగింది ఆమెను చూసింది మొదలు. కలలోకూడ కళకళ లాడే ఆమె ముఖమే_ఆ చిన్ని మచ్చలు ఆమె అందానికి అసలు కానరావడమే లేదు.

ఆమెను గురించిన ఆలోచనలో ఎన్నో ఆనందాలు_సుందర స్వప్నాలు నాన్నతో చెప్పాలంటే భయం _ అమ్మతో చెప్పి లాభంలేదు. సందిగ్ధంలో పడ్డాను. నా మాటకు నాయిష్టానికీ విలువనిచ్చేవారు లేరు_నా ఆశ్చర్యమంతా సుఖమయ జీవితానికి నిబంధనలు నియమాలు. బాహ్య ఆడంబరాలు అడ్డు వస్తాయనే. ఆ మర్నాడు సాయంకాలం వాళ్ళింటికి వెళ్ళి ఆమెనైనా ఒప్పించాలని బుద్ధిపుట్టింది: కాని స్త్రీకికూడ యిష్టాయిష్టాలుంటాయి_ వారి అభిప్రాయాలకుకూడ విలువనివ్వాలి. జీవితంలో సమభాగి అయే స్త్రీకి తన గురించి తను ఆలోచించుకొనే తీరిక స్వాతంత్రం ఇవ్వాలి. అది లేకుండా కేవలం బాహ్య స్వరూపానికే విలువనిస్తే జీవితంలో అశాంతి అసంతృప్తి విసుగు నిరాశ అన్నీ ఆ అందాన్ని అనుభవించిన మరుక్షణంలోనే కలుగుతాయి. ఆమె ఒప్పుకొంటుందో లేదోనన్న సంశయం నన్ను బాగా పీడించింది. అభిప్రాయాలు వ్యక్తపరచి సాహసించి జీవితంలో సుఖపడే స్త్రీలు చాల తక్కువ! సుఖపడరని కాదు: ఆ సాహసం లేక సంఘానికి ఇంట్లోవారికి భయపడి జీవితం

నరకం చేసుకున్నాక గాని రియలైజ్ కారు. ఆ సాహసం కూడ స్త్రీకి అప్పుడప్పుడు జీవితంలో అవసరమనేది సందేహాలు ఒక ప్రక్క పీడిస్తున్నా ధైర్యంగా మొండిగా వెళ్ళి తలుపు తట్టాను గాజులు గలగల మన్నాయి - నా హృదయం ఉరకలు వేసింది. తలుపులు తెరువబడ్డాయి- ఎదురుగా అమ్మాయి-ఎవరో కొత్త అమ్మాయి - రెండు జడలు-నున్నగా మెరిసిపోయే తెల్లటి వదనం! 'ఓ! పెళ్ళికొడుకుగారా!' తనే ముందు అంది ఏమనాలో తెలియక "మీరు..." అన్నా—"పెళ్ళికూతురు" మా అక్కయ్యే లెండి ప్రస్తుతం వూళ్ళో లేదుగా అంటూ ఆశ్చర్యంగా చూసింది. రూపురేఖలు ఒకేలా ఉన్నా ఆమె చెల్లెలుగా భావించలేక పోయినందుకు నొచ్చుకోకుండా ఉండలేక పోయాను.

పని బెడిసి కొట్టింది - నా ముఖంలో రంగులు ఆమె కళ్ళలో చూసినట్లనిపించింది. "రండి మా నాన్నగారు యిప్పుడే వస్తారు" అంది. తను-వుండాలనిపించలేదు. మీ అక్కయ్య ఎప్పుడు వస్తుంది అనడగబోయాను వాళ్ళభిప్రాయం మార్చుకున్నారేమోనని అనుమానమేసింది. మళ్ళీ వస్తానంటూ వచ్చేశాను. దారిలో మరో ఆలోచన తట్టింది. అమ్మా నాన్నకీ యీ అమ్మాయన్నా నచ్చుతుందా అని! అప్పుడే ఎంత మార్పుకలిగిన ఆశలు కన్న కలలు అన్నీ వృధాయేనా - అసహ్యమేసింది మగ హృదయాలపై.

మగవాడు అందానికి దాసుడౌతాడు. తన వస్తువుగా చేసుకోవాలని ఆత్ర పడతాడు. అనుభవించాక గాని అర్థంకాదు. అందు వెనుక ఉండే అంతరార్థం, చదువుకి చదువు విజ్ఞానానికి విజ్ఞానం జతపడాలనే ఆరాటంవల్లే ఎప్పుడూ అమాయకులు నిస్సహాయంగా మిగిలిపోతారు- సమానత్వం కావాలి - అందరిలో అనడమే మిగిలింది. చదువుకున్న వాడూ అందమైన వాడూ అలాంటి వారినే కావాలనుకుంటారు. మనిషి, మనసు, ఆత్మ, అభిమానం; జీవితంలో ఉండి తీరాలనిపిస్తుంది.

నిజంగా అవి అమర్చుకో లేక పైపై మెరుగులకు మోసపోయిన తర్వాత. అందుకే మార్పు రావల్సింది దేశంలో సంఘంలో కాదు! ముందు మనుషుల హృదయాలలో! అప్పుడే శాంతి సుఖం నిజంగా లభ్యమయ్యేది-నాగరికత నేర్పే యీ విజ్ఞానం వలననే ఎందరో అమాయకులు ముఖ్యంగా స్త్రీలు తమలో ఉండే లోపాల నిజానికవి తము కల్పించుకొన్నవీ కాకపోయినా సంఘం దృష్టిలో పురుషుడి దృష్టిలో దూరమయి అన్యాయాన్ని సహిస్తూ అసహాయంగా మిగిలిపోక తప్పటం లేదు.

మె అలానే నడుస్తూనే ఉంది చిత్రాలయ రోడ్డు దాటాము- నేనూ నడకలో తీవ్రత చూపలేదు. అచ్చు ఆమే! నా జీవితంలో ఎందరు మోసంచేసినా నా కళ్ళు నన్ను మోసం చేయవన్న నమ్మకం బాగా కుదిరింది. యేళ్ళు గడిచాయి. ఆమెకు వివాహమయి ఉండవచ్చు- ఆయనెలావుంటాడో చాలా అందంగా ఉంటే బాగుణ్ణు అనిపించింది. నేనెంత అందాన్ని కోల్పోయానో అయినా నా తులసి కేం తక్కువ? అందంగానే వుంటుంది. ఆదరంగానే మాట్లాడుతుంది-తను వెనక్కి తిరిగి చూస్తే ఏమౌతుందో? నాకు పెళ్ళయినట్టు తెలిస్తే... బాధపడుతుందా? ఏమో పెళ్ళయిన ఆడదానికి పెళ్ళికాని మగాడంటే చులకన! పైగా తండ్రి నయ్యానని తెలిస్తే మాట్లాడుతుందా? అమ్మో! అడిగినా చెప్పకూడదు- అయినా ఎందుకొచ్చిందీ పూరు?

ఆలోచనలు వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి-దూరంగా బిచ్చగాడె అరుపులు-మురికి కాలవమీద దోమలు రేగిన చప్పుడు-అనారోగ్యం డాక్టర్లవల్లే గాని పరిశుభ్రతవల్ల తీరేది కాదేమో! ఆమె మలుపు తిరిగింది. నేనూ తిరిగాను యాంత్రికంగా-లైటు కాంతి నామీదేవుంది-వీధి నిర్మానుష్యంగా ఉంది-చటుక్కున ఆమె వెనక్కి తిరిగిచూసింది ఆశ్చర్యపోయాను - తను తల తిప్పుకాని మళ్ళీ చూపి 'మీరు...ఆ రోజు...' అనబోతోంది-పూర్తిగా కోలుకోకుండానే-' ఆఁ నేనే..." అన్నాను, నా ఆశ్చర్యమంతా నేనూహించుకున్న ఆమె కాకపోవటం కాదు! ఆమె చెల్లెలికికూడ ఆ మచ్చ లెలా వచ్చాయనే!!!

(20వ పేజీ తరువాయి)

అట్లా చదవడం సులభం, మననం చేసుకుంటూ చదవడం కష్టం. పాఠం సరిగ్గా వచ్చిందో లేదో చూచుకుంటూ, నెమరు వేసుకుంటూ చదవడానికి కొంత ప్రయత్నమూ సాధన కావాలి. ఊరికే చదవడానికి అంత శ్రమపడనక్కర లేదు.

చదివినదాని సారం గ్రహించి, దాన్ని తిరిగి సంగ్రహంగా చెప్పగలగడం, జ్ఞానాన్ని అలవర్చుకొనడానికి సరియైన మార్గమని. అదే కన్నతల్లి వంటిదని చెబుతుంటారు. ఇది నిజమైన మాట. చదివిన విషయాన్ని నెమరు వేసుకుంటూ చదివితే, అది బాగా జ్ఞాపకం ఉంటుంది.